

గీతం స్ట్రాంగ్‌రూమ్ భద్రత రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

పటాన్‌చెరు, మే 21: స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన జహీరాబాద్ ఎంపీ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈవీఎంను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఉన్న భద్రత సిబ్బందితో మాట్లాడారు. కంట్రోల్ రూమ్ వద్ద పోలీసు భద్రత, సీసీ కెమెరాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత ఉన్నదని, నిత్యం పోలీసులు పహారా కాస్తున్నారన్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలను ఇక్కడ భద్రపరిచినట్లు తెలిపారు. ఆమె వెంట నిమ్జ్ ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, సెర్వేయర్ కోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.23 కోట్లతో మరమ్మతులు

- జిల్లాలోని 754 పాఠశాలల్లో పనులు
- సెలవులు పూర్తయ్యేలోగా పూర్తిచేయాలని ఆదేశం
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

రుద్రారం జడ్పీహెచ్‌ఎస్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

పటాన్‌చెరు, మే 21: జిల్లాలోని 754 పాఠశాలలను రూ.23 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా అభివృద్ధి చేస్తామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలో జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల, వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరమ్మతులు, తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫ్లోరింగ్‌ను, మరమ్మతు పనులను, నిర్మాణంలో ఉన్న వేదికను, మరుగుదొడ్లను, తాగునీటి నల్లాలను పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్, ఎంఈవో పీపీ రాథోడ్‌లతో మాట్లాడి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి సెలవులు పూర్తయ్యేలోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. జడ్పీహెచ్‌ఎస్ వెనుక ఉన్న స్థలం పాఠశాలకు చెందినదని ఎంఈవో అదనపు కలెక్టర్‌కు వివరించారు. దానిని స్కూల్ అవసరాలకు వాడుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విలువైన స్థలం కావడంతో కొందరు ఆ స్థలంపై కన్నేసి అడ్డుకుంటున్నారని చెప్పారు. స్పందించిన అదనపు కలెక్టర్ తప్పకుండా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. టాయిలెట్స్ నిర్వహణలో తరుచూ వైఫల్యాలు చూస్తున్నామని, ఈసారి టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచేలా చూస్తామన్నారు. జిల్లాలో రూ.23 కోట్లతో 754 పాఠశాలలను అమ్మ ఆదర్శపాఠశాలలుగా ఎంపిక చేసి మరమ్మతులు చేస్తున్నామని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. రూ.6 కోట్ల 50లక్షలు ఇప్పటికే విడుదలయ్యాయన్నారు. 35 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నదన్నారు. పనుల నాణ్యతలో రాజీపడమన్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల్లోని పాఠశాలల్లో పనులు చురుకుగా సాగుతున్నాయని ఎంఈవో పీపీ రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ రంగారావు, ఎంఈవో పీపీ రాథోడ్, గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్, కాంట్రాక్టర్ టోపి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

న్యాల్‌కల్, మే 21: ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ముజీబ్ తెలిపారు. స్థానిక పరీక్ష కేంద్రంలో హద్నూర్, న్యాల్‌కల్, రాయికోడ్, వట్‌పల్లి మండలాలకు చెందిన ప్రభుత్వ, గురుకుల కళాశాలలోపాటు ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఈ పరీక్షలకు ఫస్టియర్ నుంచి 360, సెకండియర్‌కు 158 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

24న పాలిసెట్

కోహీర్, మే 21: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తామని రంజోల్ సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి మంగళవారం ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్‌లోని డిగ్రీ కళాశాల, ఆర్ఎల్ఆర్ పాఠశాల, రంజోల్ పాలిటెక్నిక్ కళాశాల్లో పాలిసెట్ ఉంటుందన్నారు. ఉదయం 11గంటలకు అర్హత పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 1.30గంటలకు ముగుస్తుందన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 10 గంటలకు చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించమని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 21: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 20 నుంచి నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. అండర్-14, 16, 19, 23 కేటగిరీల బాల, బాలికలకు శిక్షణ ఇచ్చారు. సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ముగింపు వేడుకలకు క్లైం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి హాజరై క్రీడాకారులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో అయినా, ఆటల్లో అయినా క్రమశిక్షణ ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఈ జట్లు హైదరాబాద్‌లో ఈనెల 24 నుంచి జరిగే టీ-20 టోర్నమెంట్‌లో పాల్గొంటుందని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డాక్టర్ కూన వేణు, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కోచ్‌లు చంద్రమౌళి, ఇనాం, రియాజ్, మధుమోహన్, రఘుపతి, తౌహీద్, జితేందర్‌రెడ్డి, దారాసింగ్, విజయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, మే 21: విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం ఉంటుందని ఆర్సీపురం ఏఈ సంజీవ్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలిగింపు ప్రక్రియలో భాగంగా అశోక్‌నగర్, వినాయకనగర్, కానుకుంట, జ్యోతినగర్ ఫీడర్‌లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు కరెంట్ ఉండదని, మధ్యాహ్నం 1.30గంటల నుంచి 3గంటల వరకు హెచ్ఐజీ, ఎల్ఐజీ, బీడీఎల్, మ్యాక్‌సొసైటీ, ఆర్ఆర్‌నగర్, బీడీఎల్ అపార్ట్‌మెంట్స్‌లో కరెంట్ ఉండదని ఏఈ తెలిపారు.

బొల్లారంలో..

బొల్లారం, మే 21: మున్సిపాలిటీలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్, న్యూ బస్టాండ్, వెంకట్ రెడ్డి నగర్, జీపీఓ ఏరియా, పోచమ్మ బస్తీలో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ అశోక్ రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతాల్లో 11 లైన్లపై చెట్ల కొమ్మలు తొలిగిస్తున్నామని తెలిపారు.

అమీన్‌పూర్‌లో..

అమీన్‌పూర్, మే 21: అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో చెట్ల కొమ్మలు తొలిగించనున్న క్రమంలో విద్యుత్ సరఫరాలో బుధవారం మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఏఈ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. కేజీఆర్ కాలనీ, ఎమ్మెస్ హోమ్స్, టీచర్స్ కాలనీ, పద్మావతి హోమ్స్, సత్యా కృప, శ్రీనివాస్ హోమ్స్, రావు ఎన్‌క్లేవ్, త్రిపుర ఎన్‌క్లేవ్, మోడీ బిల్డర్స్, లింగయ్య కాలనీ, ఎన్ఎస్ఎల్ కాలనీ, భవానీపురంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మనూరులో..

మనూరు, మే 21: పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని పూసల్‌పాడ్ ఫిడర్ పరిధిలోని మనూరు, బోరంచ, బెల్లాపూర్, తోర్నాల్ సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించేదుకు విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్లను నరికివేస్తున్నట్లు తెలిపారు.

తోర్నాల్ యువకుడికి గౌరవ డాక్టరేట్

డిగ్గే బాబు

నారాయణఖేడ్, మే 21: మనూరు మండలం తోర్నాల్ గ్రామానికి చెందిన డిగ్గే బాబుకు గౌరవ డాక్టరేట్ దక్కింది. మానవ హక్కులకు సంబంధించి బాబు చేసిన కృషికి గాను ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ తపన్‌కుమార్ రౌటారి బాబుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మానవ హక్కుల పట్ల గ్రామాల్లో చైతన్యం కల్పించడం, కుల వివక్షపై అవగాహన, తదితర కార్యక్రమాలతో పాటు కరోనా సమయంలో పలు సేవా కార్యక్రమాల్లో బాబు చురుకుగా పాల్గొన్నారు. పేద కుటుంబానికి చెందిన డిగ్గే బాబు డాక్టరేట్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ డాక్టరేట్ సాధించేందుకు ప్రోత్సహించిన నవోదయ సిద్దుకు కృతజ్ఞతలు తెలిపారు.

దొడ్డు వడ్లకూ రూ.500 బోనస్ ఇవ్వాలి

నారాయణఖేడ్, మే 21: దొడ్డు వడ్లకూ రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నారాయణఖేడ్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమేల మాణిక్ ఆధ్వర్యంలో ఆర్డీవో అశోక చక్రవర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేశ్, సతీశ్, అరుణ్, సంతోశ్, ప్రశాంత్, అర్జున్, అంబేడ్కర్ సంఘం బాధ్యులు కాన్షీరాం, బస్వరాజ్, విశ్వాస్ పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

కోహీర్, మే 21: సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ వ్యవసాయ విస్తరణాధికారులు కోరారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో జనుము, జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలో తేమ ఉన్నప్పుడే విత్తనాలను నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రదీప్‌కుమార్, రాజు, వీరేందర్, రమేశ్‌పాటిల్, డీసీఎంఎస్ కార్యాలయ ఇన్‌చార్జి దత్తు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

నారాయణఖేడ్, మే 21: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో 13 రకాల వైద్య పరీక్షలు చేస్తారని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. మంగళవారం 110 మందికి పరీక్షలు నిర్వహించగా మరో రెండు రోజుల పాటు నిర్వహించే శిబిరంలో మిగతా వారికి పరీక్షలు చేస్తారన్నారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం

బొల్లారం, మే 21: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు మూడంతస్తుల భవనం స్లాబ్ కూలిన ఘటనలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయి దవఖానలో చికిత్స పొందుతున్న దీపాంకర్ దాస్ అనే యువకుడిని స్థానిక సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి మంగళవారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడికి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

వైభవంగా బోనాలు

నిజాంపేట్, మే 21: మండల కేంద్రం నిజాంపేటలో కనకదుర్గ మాత ఆలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మెదటి రోజు మంగళవారం సాయంత్రం గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనాలతో ఆలయం వద్దకు వెళ్లి అమ్మకు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

హద్నూర్ చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సంబంధిత శాఖల సిబ్బంది

న్యాల్‌కల్, మే 21: నమస్తే తెలంగాణ దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన 'ఓ వైపు ఆక్రమణ.. మరోవైపు మట్టి దందా' అనే వార్త కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మండల రెవెన్యూ అధికారి భూపాల్ ఆదేశాల మేరకు మండలంలోని రాజోలా గ్రామంలోని సర్వే నంబర్ 101 ప్రభుత్వ భూమిని ఆర్ఐ దుర్గయ్య, సర్వేయర్ లాల్‌సింగ్‌లు పరిశీలించారు. మొరం పోసి చదును చేసిన భూమిని కలియ తిరిగి పరిశీలించారు. టిపాన్ తీసుకువచ్చి సర్వే చేస్తామని, అప్పటివరకు భూమిలోకి ఎవ్వరు వెళ్లవద్దాన్నారు. భూమిలో ఎలాంటి పనులు చేయొద్దని, చేస్తే చట్టారీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. భూమిలోని రైతులు వెళ్లాకుండా వేసిన మట్టి, ఫెన్సింగ్‌ను తొలిగించాలని సూచించారు. హద్నూర్ పెద్ద చెరువు ప్రాజెక్టులో అనుమతి లేకుండా మట్టిని తరలింపు ప్రదేశాన్ని నీటి పారుదాల, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. చెరువులు, ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎవరైనా మట్టిని తీసుకెళ్లాలంటే ముందుస్తుగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

టేకులకుంటను పరిశీలించిన అధికారులు

టేకుల కుంటను పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం, మే 21: ఊట్ల గ్రామ పరిధిలోని టేకుల కుంటను రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. సోమవారం రియల్ వ్యాపారులు టేకుల కుంటపై ఉపాధి హామీ పనుల కింద ఇటీవల పునరుద్ధరించిన కట్టను జేసీబీతో ధ్వంసం చేయడంపై ఉపాధి హామీ ఫీల్డ్ ఆఫీసర్ రమేశ్, గ్రామ మత్స్య సహకార సంఘం సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, సర్వేయర్ రామభద్ర, ఇరిగేషన్ ఏఈ దిలీప్ కుమార్ టేకుల కుంటను రెండు శాఖల రికార్డుల ప్రకారం పరిశీలించారు. కుంటపై పోసిన కట్టను జేసీబీతో తొలిగించినట్లుగా స్పష్టంగా ఉందని అధికారులు తెలిపారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని, వారి ఆదేశాల మేరకు తర్వాతి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు చేసిన మాకే సమాచారం ఇవ్వకుండా అధికారులు టేకుల కుంటను సర్వే చేసి వెళ్లడంపై ఊట్ల గ్రామ మత్స్య సహకార సంఘం సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. టేకుల కుంట కట్టను ధ్వంసం చేసిన వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

స్వచ్ఛభారత్‌లో భాగంగా చెత్తాచెదారాన్ని తొలిగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, మే 21: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, అర్థశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలోని గ్రీన్ లైబ్రరీ, బొటానికల్ గార్డెన్, పరిసర ప్రాంతాల్లో పేరుకున్న చెత్తా చెదారాన్ని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తొలిగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సిద్దులు, డాక్టర్ అభిజిత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో బీబీ పాటిల్ పూజలు



ఎల్లమ్మను దర్శించుకుంటున్న బీబీ పాటిల్

చౌటకూర్, మే 21: జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో లక్ష మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో కొనసాగుతున్న రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలకు మంగళవారం హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, బీజేపీ మండల అధ్యక్షుడు నీరుడి ప్రవీణ్‌కుమార్ ముదిరాజ్, నాయకులు రమేశ్‌బస్వరాజ్ పాటిల్, పలువట్ల జగదీశ్వర్, సార రాజ్‌కుమార్, పల్లె ప్రభుకుమార్‌గౌడ్, కుమార్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, సుధాకర్ గౌడ్, గాండ్ల శ్రీనివాస్, కలాలి సత్యాగౌడ్, హరిశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

40 రోజులైనా కొనుగోళ్లేవి?

శేర్కాన్‌పల్లిలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతులు

ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

హత్నూర, మే 21: మండలంలోని శేర్కాన్‌పల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 40రోజులు కావస్తున్నా ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభించలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద రోజుల తరబడి ఎదురుచూసినా కొనుగోలు చేయడం లేదని, ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లను కిరాయికి తెచ్చామని, రోజూ కిరాయి కట్టలేక పోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ట్రావెల్స్ తీరుతో ప్రయాణికుల ఇక్కట్లు

- మార్గమధ్యంలో బస్సును నిలిపివేసిన డ్రైవర్
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు.. కేసు నమోదు

ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ వద్ద గోవాకు వెళ్లాల్సిన ప్రయాణికులు

రామచంద్రాపురం, మే 21: ఓంశ్రీ ట్రావెల్స్ బస్సు డ్రైవర్, యాజమాన్యం దురుసు ప్రవర్తన ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. అందులో ఓ యువకుడి భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారింది. గోవాకు వెళ్లాల్సిన ప్రయాణికులు రాత్రంతా పోలీస్టేషన్‌లోనే గడపాల్సిన పరిస్థితి ఎదురైంది. వివరాల్లోకి వెళ్తే..న హైదరాబాద్ నుంచి గోవాకు వెళ్లేందుకు 25 మంది ప్రయాణికులు వేర్వేరుగా ఓంశ్రీ ట్రావెల్స్ బస్సుని బుక్ చేసుకున్నారు. ఎల్‌బీనగర్ నుంచి ప్రయాణికులను పికప్ చేసుకోవాల్సి ఉండగా మియాపూర్ వద్దకు రావాలని ఆ డబ్బులు తామే చెల్లిస్తామని ట్రావెల్స్ వారు చెప్పారు. ఆయా ఏరియాల నుంచి ప్రయాణికులు మియాపూర్‌కి వచ్చి బస్సులో ఎక్కారు. అయితే బస్సులో కనీస సౌకర్యాలు లేకపోవడంతోపాటు విద్యుత్ వైర్లు తేలి ఉండడంతో ప్రయాణికులు బస్సు డ్రైవర్‌కు చెప్పారు. అతను నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ దురుసుగా ప్రవర్తించాడు. మియాపూర్‌ని నుంచి ప్రారంభమైన బస్సును ఆర్సీపురంలోని అశోక్‌నగర్ వద్దకు రాగానే డ్రైవర్ ఆపి దిగి వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో ప్రయాణికులు డయల్ 100కి కాల్ చేసి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి వచ్చి డ్రైవర్‌తోపాటు బస్సుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ అక్కడినుంచి పారిపోయి ఉదయం వరకు రాలేదు. డ్రైవర్ కోసం, బస్సు కోసం వేచి చూస్తూ ప్రయాణికులు పిల్లాపాపలతో రాత్రంతా పోలీస్‌స్టేషన్ వద్దే ఉండిపోయారు. ట్రావెల్స్ యజమాని సునీల్‌కి జరిగిన విషయాన్ని ప్రయాణికులు తెలిపితే, వారికి అతను కూడా నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ ఏం చేసుకుంటారో చేసుకోండని, కేసు పెడితే పెట్టుకోండని అన్నారని ప్రయాణికులు చెప్పారు. ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓంశ్రీ ట్రావెల్స్ యజమాని సునిల్, డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ కేసు నమోదు చేసుకొని డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంచి మనసు చాటుకున్న ప్రయాణికులు

ట్రావెల్స్‌లో ప్రయాణించే వారిలో చరణ్ వర్మ అనే యువకుడు ఇండియన్ కోస్ట్ గార్డు అసిస్టెంట్ కమాండెంట్ ఇంటర్వ్యూ కోసం బుధవారం ఉదయం 6గంటల వరకు గోవాకు చేరుకోవాల్సి ఉంది. ట్రావెల్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో వెళ్లలేకపోయాడు. ఈ జాబ్ కోసం కొన్నేళ్లుగా ఎదురుచూశానని, ఇప్పుడు ఎలా వెళ్లాలో అర్థం కాకుండా ఉందని చరణ్‌వర్మ ఆవేదన వ్యక్తం చేశాడు. తన ఆవేదనను అర్థం చేసుకున్న తోటి ప్రయాణికులు అందరూ డబ్బులు పోగు చేసి చరణ్‌వర్మకు ఫ్లైట్ టికెట్ బుక్ చేసి గోవాకు పంపేలా ఏర్పాట్లు చేసి మంచి మనసు చాటుకున్నారు.

నేడు బీఆర్ఎస్ ధర్నా

కల్హేర్, మే 21: యాసంగిలో రైతులు పండించిన జొన్నలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని నిరసిస్తూ నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 161 నంబర్ జాతీయ రహదారి మహాదేవుపల్లి ఎక్స్ రోడ్డుపై రాస్తారోకో చేపట్టనున్నట్లు జడ్పీటీసీ నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్ తెలిపారు. ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నాలుగో అంతస్తు నుంచి పడి కూలీ మృతి

అమీన్ పూర్, మే 21: పనిచేస్తున్న చోట ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన వలస కార్మికుడు అరుణ్‌లెట్(22) అమీన్‌పూర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్ నంబర్ 7 తేజ రామ్ బిల్డర్ కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తుకు కింది నుంచి లిఫ్ట్ మిషన్ ద్వారా ఇటుకలను షిఫ్టింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి కింద పడ్డాడు. గమనించిన తోటి కూలీలు రంజన్ మహల్దార్, తదితరులు చందానగర్ మెడికవర్ దవాఖానకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే అరుణ్ లెట్ మృతి చెందినట్లు తెలిపారు. తేజరామ్ ఎలాంటి ముందస్తు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే అరుణ్ లేట్ మృతి చెందాడని రంజన్ మహల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్సై సోమేశ్వరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ తీగలుతగిలి రెండు ఎడ్లు మృతి

హత్నూర, మే 21: విద్యుత్ తీగలు తగిలి రెండు ఎడ్లు మృతిచెందిన ఘటన మండల కేంద్రమైన హత్నూర శివారులో సోమవారం స